క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్యామా నవరాత్రి ఉత్సవాలు



రాజశ్యామల హోమం నిర్వహిస్తున్న భక్తులు

సబ్బవరం:ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో నిర్వహిస్తున్న శ్యామా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం రాజశ్యామల అమ్మవారు దమనోత్సవ దివ్యాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం ద్వారా భార్యాభర్తల మధ్య సఖ్యత,దాంపత్య సుఖంతో పాటు ఆరోగ్యం లభిస్తాయని భక్తుల విశ్వాసం.అలాగే వసంతపంచమి కావడంతో గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. అనంతరం శ్యామా అమ్మవారికి ప్రత్యేక పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. చిన్నారులతో వాగ్దేవి హోమం జరిపించారు. మధ్యాహ్నం రాజశ్యామల హోమం నిర్వహించారు. గురుమాత అన్నపూర్ణమ్మ భక్తులందరికీ ఉచిత అన్నప్రసాద వితరణ చేశారు.

కల్యాణం.. కమనీయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం , మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయ దాతలకు కల్యాణ అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

ఆదర్శనీయుడు సంజీవయ్య



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు నాగేశ్వరరావు,నిర్మలాదేవి

సబ్బవరం:దామోదరం సంజీవయ్య జీవితం ఎందరికో ఆదర్శనీయమని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం సీనియర్ అధ్యాపకుడు ఆచార్య నాగేశ్వరరావు అన్నారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో దామోదరం సంజీవయ్య 103వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సంజీవయ్యలోని పట్టుదల,క్రమశిక్షణ ఆయన్ను ఉన్నత శిఖరాలను చేరుకునేలా చేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ నిర్మలాదేవితో పాటు విశ్వవిద్యాలయ అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో డిప్యూటీ మేయర్ పూజలు



వెంకన్న సన్నిధిలో పూజలు చేస్తున్న జియ్యాని శ్రీధర్

పెందుర్తి: వెంకటాద్రిని నగర డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ బుధవారం సందర్శించారు. వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వెంకటాద్రిపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈవో నీలిమ, ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

పరిశోధకుల మెస్ పరిశీలన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిశోధకుల మెస్‌ని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం పరిశీలించారు. మధ్యాహ్న భోజన సమయంలో ఆకస్మికంగా మెస్ తనిఖీ చేసి పరిశోధకులతో మాట్లాడారు. భోజన నాణ్యత అడిగి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ పరిసరాలు, కిచెన్ పరిశీలించారు. హాస్టల్ మెస్‌లో సిబ్బంది క్రమశిక్షణతో పని చేయాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని అందించాలన్నారు. హాస్టల్ వార్డెన్లు, చీఫ్ వార్డెన్లు నిరంతరం విద్యార్థుల భోజన సదుపాయాలు పర్యవేక్షించాలని సూచించారు. ఆయనవెంట చీఫ్ వార్డెన్ ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య జి.వీర్రాజు వున్నారు.

వెన్నలపాలెం పంచాయతీ జనాభా	మొత్తం ఓటర్లు	శివారు గ్రామాలు: గొల్లలపాలెం, బీసీ కాలనీ, హనుమాన్ కాలనీ మంజూరు చేసిన అభివృద్ధి పనులు	కేటాయించిన నిధులు	పూర్తి చేసిన అభివృద్ధి పనుల విలువ	కొనసాగుతున్న పనులు విలువ	సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో చేరిన నిధులు
4765	2880	23	రూ. 2.65 కోట్లు	రూ. 93.94 లక్షలు	రూ. 1.71 కోట్లు	రూ. 19.57 కోట్లు

వెలుగు రేఖ



వెన్నలపాలెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

- వెనుకబాటు నుంచి ప్రగతి పథం వైపు
- 99 మందికి జగనన్న ఇళ్ల పట్టాలు
- మారిన వెన్నలపాలెం రూపు రేఖలు



వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్

పరవాడ: అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న వెన్నలపాలెం రూపు రేఖలు మారాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రగతి బాట పట్టింది. నాలుగున్నరేళ్లలలో ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాభివృద్ధిలో అగ్రపథాన నిలిచింది. మౌలిక వసతులు సమకూరాయి. సంక్షేమ పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయి. మొత్తంగా వెన్నలపాలెం పంచాతీ నేడు కళకళలాడుతోంది.

ఇదీ పరిస్థితి

ఏళ్ల తరబడి వెనుకబాటుకు గురైన వెన్నలపాలెం పంచాయతీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మహర్దశ పట్టింది. గ్రామంలోని 99 మంది నిరుపేద కుటుంబాలకు జగనన్న ఇళ్ల కాలనీలో ఇంటి స్థలాలతో పాటు ఇళ్లు మంజూరు చేసింది. ప్రజలు పశుపోషణ, వ్యవసాయం పై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. గతంలో గ్రామ ప్రజలు తాగునీరు, విద్యుత్, వీధి రోడ్ల సమస్యలతో సతమతమయ్యేవారు. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీరి కష్టాలకు విముక్తి లభించింది. రైతులు తమకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందుల కోసం మండల కేంద్రమైన పరవాడ పరుగులు తీయాల్సి వచ్చేది. నేడు ఆ పరిస్థితి లేదు. గ్రామంలోనే ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు లభ్యమవుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ సచివాలయంలో అవసరమైన ప్రభుత్వ సేవలు పొందుతున్నారు.

వసతుల కల్పన

గ్రామంలో అనేక మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా తీర్చిదిద్దారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం పలు చోట్ల మంచినీటి పథకాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చింది. జల్‌జీవన్ మిషన్ పథకంలో భాగంగా గొల్లలపాలెం గ్రామంలో ఇంటింటి కుళాయిలను ఏర్పాటు చేసింది. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నిరుపేదల ప్రజలకు కార్పొరేట్ వైద్య సేవలు అందిస్తూ భరోసా కల్పిస్తుంది. నాడు–నేడు పథకంలో పాఠశాలలో వసతులు కల్పించింది.



అయ్యప్పస్వామి ఆలయం నుంచి రైస్ మిల్లు వరకు నిర్మించిన సీసీ రోడ్డు

గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు - చేసిన ఖర్చు

పని	ఖర్చు
గ్రామ సచివాలయ భవనం	రూ.25 లక్షలు
రైతు భరోసా కేంద్రం	రూ.21.80 లక్షలు
వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్	రూ. 20.80 లక్షలు
వైఎస్సార్ డిజిటల్ లైబ్రరీ	రూ. 16 లక్షలు
బల్క్‌మిల్క్ చిల్లింగ్ యూనిట్	రూ.15.74 లక్షలు
ఎంపీపీ పాఠశాల అభివృద్ధి	రూ.12.44 లక్షలు
బీసీ కాలనీలో పైల అప్పారావు- కలపాక రోడ్డు వరకు సీసీ డ్రైన్, రోడ్డు నిర్మాణం	రూ.16.50 లక్షలు
వెన్నలపాలెంలో ఇంటింటి కుళాయిల నిర్మాణం కోసం ప్రతిపాదనలు	రూ.55 లక్షలు
గొల్లలపాలెంలో ఇంటింటి కుళాయిల నిర్మాణం	రూ.12 లక్షలు
వివిధ చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి	రూ.60 లక్షలు

అభివృద్ధి పనుల్లో టాప్



జగనన్న ప్రభుత్వంలో గ్రామం రూపురేఖలు మారిపోయాయి. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు గ్రామంలోనే అందుబాటులోకి వచ్చాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచితంగా అందుతున్న వైద్య సేవలతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– వెన్నల అప్పారావు, సర్పంచ్, వెన్నలపాలెం

ఇబ్బందులు తప్పాయి



వ్యవసాయ పంటలకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, పురుగు మందు ఇంటి సమీపంలోని ఆర్బీకేలో లభ్యమవుతున్నాయి. దీంతో వ్యయ ప్రయాసలు తప్పాయి. వ్యవసాయ పంటలపై రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు ఆర్బీకే ఉద్యోగులు సూచిస్తున్నారు. ఆర్బీకే ఏర్పాటుతో రైతుల కష్టాలు తప్పాయి.

– పైల మణి, వెన్నలపాలెం

నాణ్యమైన విద్య



గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దారు. పాఠశాలను అభివృద్ధి చేయక మునుపు పిల్లలను కాన్వెంట్లకు పంపేవాళ్లం. పాఠశాల అభివృద్ధి చెందిన తర్వాత పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాం. ఉపాధ్యాయులు నాణ్యమైన విద్యా బోధన అందిస్తున్నారు.

– బండారు కుమారి, వెన్నలపాలెం

కుష్టురోగులకు వస్తువుల వితరణ



కుష్టు రోగులకు వస్తువులు పంపిణీ చేస్తున్న డీపీఎంవోలు రామకృష్ణ, ప్రసాదరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా కుష్టునివారణాధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు ఆదేశాల మేరకు బుధవారం ×స్పర్శ× అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడవివరంలోని ఏఎంజీ లెప్రసీ కాలనీలో 53 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు డిప్యూటీ పారా మెడికల్ అధికారులు .కె.ప్రసాదరావు,పి.రామకృష్ణ బియ్యం, పప్పు, పండ్లు,సెల్ఫ్ కేర్ కిట్స్, మందులు పంపిణీ చేశారు. వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలను, మందులు వాడడం గురించి రోగులకు వివరించారు. డీపీఎంవో పి.రామకృష్ణ, ప్రసాదరావు ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు కళ్లద్దాల పంపిణీ



విద్యార్థులకు కళ్లద్దాలు అందజేస్తున్న లుపిన్ ఫౌండేషన్ డీజీఎం శ్రీనివాసరావు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో లుపిన్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని లుపిన్ ఫౌండేషన్ డీజీఎం శ్రీనివాసరావు అన్నారు. లుపిన్ సీఎస్సార్ విభాగం ఆధ్వర్యంలో తానాం బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు సమకూర్చిన కళ్లద్దాలను డీజీఎం శ్రీనివాసరావు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం బి.కుమార్, రెసిడెన్షియల్ పాఠశాల ప్రిన్సిపాల్ బి.అప్పలనాయుడు, సురేష్‌బాబు, డి.వెంకటనారాయణ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా వేణుగోపాలస్వామి ఆలయ ప్రారంభోత్సవం



కొలువుదీరిన వేణుగోపాలస్వామి



పూజల్లో పాల్గొన్న మేయర్ హరివెంకటకుమారి



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, ఉత్సవ కమిటీ సభ్యులు

- 6 వేల మందికి అన్నసమారాధన

పెందుర్తి: పురుషోత్తపురంలో నూతనంగా నిర్మించిన వేణుగోపాలస్వామి ఆలయంలో వేణుగోపాలస్వామి(శ్రీకృష్ణుడి) విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు హోమాలు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భజనలు, కోలాటాలు, తప్పెట గుళ్లతో సందడి నెలకొంది. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనలో దాదాపు 6 వేల మంది భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు, ఆలయ కమిటీ చైర్మన్ కోరాడ చందుయాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి




ఫార్మాసిటీలో ర్యాలీ చేస్తున్న రవాణా కార్మికులు

పరవాడ : ఈ నెల 16న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన కార్మిక, రైతు సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం కార్మికులు ఫార్మాసిటీలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ రవాణా కార్మికులకు ఉరితాడు లాంటి బి.ఎన్.ఎస్ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో 16న చేపట్టనున్న సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని గనిశెట్టి పిలుపునిచ్చారు.

ఘనంగా సత్తమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట



అమ్మవారి తొలి మండపం వద్ద చీరలు సమర్పిస్తున్న మహిళలు



పూజలందుకున్న సత్తమ్మతల్లి

గోపాలపట్నం: జీవీఎంసీ 88వ వార్డు సత్తివానిపాలెం సత్తమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు అమ్మవారి ఆది మండపం వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. అమ్మవారికి చీరలు, గాజులు సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఒమ్మి కుంచుబాబు ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గర్భాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అదీప్‌రాజు, తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ, పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు మొల్లి ముత్యాల నాయుడు, గంధం శ్రీను, శ్రీనువాసరావు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ప్రజల చెంతకే ఉచిత వైద్యం

- కార్పొరేటర్ ముమ్మన దేముడు
- 440 మందికి వైద్య సేవలు



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 95వ వార్డు పురుషోత్తపురంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించాలన్న తలంపుతో ఈ బృహత్తర కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. నిరుపేదలు వైద్యానికి, విద్యకు ఇబ్బందులు పడకూడదన్న ఆలోచనతో ఆయా రంగాల్లో ఎన్నో సంస్కరణలు తీసుకు వచ్చారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్ దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నరన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మొత్తం 400 మంది ఓపికి రాగా..అవసరమైన వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. పలువురికి ఉచితంగా కంటి అద్దాలు ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. పలువురికి మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ రిఫరల్ ఆస్పత్రికి సిఫార్సు చేశారు. వైద్యాధికారి డాక్టర్ లక్ష్మి, నాయకులు, స్పెషలిస్ట్ వైద్యులు, సచివాలయ సిబ్బంది, గృహ సారథులు, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి, జ్ఞాన మార్గాల ద్వారానే భగవదనుగ్రహం

- బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ
- ముగిసిన హనుమద్వైభవ ప్రవచనాలు



హనుమద్వైభవాన్ని వివరిస్తున్న సామవేదం షణ్ముఖ శర్మ



కీర్తనలు ఆలపిస్తున్న చైతన్య బ్రదర్స్

ఎంవీపీకాలనీ: భక్తి, జ్ఞాన మార్గాల ద్వారా మాత్రమే భగవదనుగ్రహాన్ని పొందగలమని బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖ శర్మ అన్నారు. ఎంవీపీ కాలనీలోని ఏబీసీ పార్కు వేదికగా హనుమాన్ చాలీసా వ్యాఖ్యానంతో నిర్వహిస్తున్న హనుమద్వైభవ ప్రవచనాల్లో భాగంగా ఆయన అనుగ్రహ భాషణం చేశారు. ఆంజనేయుడిని ఆరాధిస్తే సకల దేవతలను ఆరాధించినట్లే అన్నారు. మార్గశిర మాసంలో హనుమారాధన శుభప్రదమన్నారు. పలు అధ్యాత్మిక అంశాలపై భక్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా చైతన్య బ్రదర్స్ భక్తి సంగీత విభావరి అలరించింది. ప్రవచనాల అనంతరం భక్తులు పెద్ద ఎత్తున షణ్ముఖ శర్మ ఆశీస్సులు తీసుకున్నారు. కొద్ది రోజులుగా జరుగుతున్న ప్రవచనాలు బుధవారంతో ముగిశాయి.

సరస్వతీ నమస్తుభ్యం

- వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు



సరస్వతీ పూజలో పాల్గొన్న రవీంద్రభారతి విద్యార్థులు



ఎస్ఆర్ పురంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు అందిస్తున్న రోషి ఫౌండేషన్ ప్రతినిధులు



శారదాపీఠంలో అక్షరాభ్యాసాల్లో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు

పెందుర్తి: వసంత పంచమిని పురస్కరించుకుని పెందుర్తి ప్రాంతంలోని పలు ఆలయాలు, పాఠశాలల్లో సరస్వతీ దేవి పూజలు ఘనంగా నిర్వహించారు. సుజాతనగర్ రవీంద్రభారతి పాఠశాలలో పెద్ద ఎత్తున అక్షరాభ్యాసాలు జరిపారు. జీఎం కె.రమ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పూజల్లో పాల్గొన్నారు,

- పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో వసంత పంచమి వేడుకలు ఘనంగా జరిపారు. విద్యార్థులు సరస్వతీ దేవి పూజలు చేశారు. రోషి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు, పలకలు అందించారు.
- పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని సరస్వతీ దేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో..



సరస్వతీదేవికి పూజలు చేస్తున్న పాఠశాల యాజమాన్యం

ఘనంగా వసంత పంచమి

పెందుర్తి: విశాఖ శ్రీశారదాపీఠంలో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వందలాది మంది చిన్నారులకు శాస్త్రోక్తంగా పండితులు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. ముందుగా పీఠంలో సరస్వతి పూజ చేశారు. రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలు జరిపిన పెన్నులు, పుస్తకాలను పీఠం ప్రతినిధులు విద్యార్థులకు అందించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

పరవాడ: మండలంలోని పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో వసంత పంచమి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి సరస్వతీ దేవికి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోనాశాంతి, మధుమిత, వినిలా, పాఠశాల హెడ్ గర్ల్ అనుశ్రీదేశముఖ్, హౌస్ కెప్టెన్‌లు ధార్మిక, సరయు, ఛార్మిత, ధ్రువన్ పాల్గొన్నారు.

ఎల్‌టీకి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు



ల్యాబ్ టెక్నీషియన్ నాగేశ్వరరావును సత్కరిస్తున్న మలేరియా అధికారి తులసి

మద్దిలపాలెం: జిల్లా మలేరియా కార్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్(ఎల్‌టీ)గా విధులు నిర్వహిస్తున్న చెల్లుబోయిన నాగేశ్వరరావు 2024 సంవత్సరానికిగాను ఇండియా బుక్ రికార్డ్స్ లో స్థానం పొందారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో నాగేశ్వరరావును ఘనంగా సత్కరించారు. జిల్లా మలేరియా అధికారి తులసి మాట్లాడుతూ వృత్తిలో రాణిస్తూనే, ఆసక్తి గల క్రీడారంగంలో క్రీడాకారులను తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ స్విమ్మింగ్, రన్నింగ్‌లో జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలకు జిల్లా నుంచి పదిమందిని పంపించడం ద్వారా ఈ గుర్తింపు లభించిందన్నారు. దీంతో ఇండియా బుక్ రికార్డ్స్ ప్రతినిధులు వర్చువల్‌గా అభినందించి సర్టిఫికెట్, మెడల్ అందించినట్లు చెప్పారు. సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయిక్, నాగ శ్రీను పాల్గొన్నారు.